క్లుప్తంగా

అయిజ-ఎమ్మిగనూరు ఆర్టీసీ బస్సు ప్రారంభం



అయిజ: మండల కేంద్రం నుంచి ఎమ్మిగనూరుకు సోమవారం ఆర్టీసీ బస్సు ప్రారంభమైంది. ఈ సందర్భంగా గద్వాల డిపో మేనేజర్ మంజులారెడ్డి మాట్లాడుతూ అయిజ నుంచి తుపత్రాల, మేడికొండ, పులికల్, రాజాపురం, నాగలదిన్నె, పులిచింతల క్రాస్ రోడ్డు, నందవరం, ముగతి మీదుగా ఎమ్మిగనూరుకు బస్సు చేరుకుంటుందని తెలిపారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కంట్రోలర్ సురేష్, డ్రైవర్ తిరుమలగౌడ్, కండక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రేపటి నుంచి కృష్ణస్వామి బ్రహ్మోత్సవాలు

మల్దకల్: మండలంలోని సద్దలోనిపల్లి కృష్ణస్వామి బ్రహ్మోత్సవాలను ఈనెల 6నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు సర్పంచ్ అశోక్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

గుంతలు పూడ్చండి



మల్దకల్: మండలంలోని సద్దలోనిపల్లి-నేతువానిపల్లి బీటీరోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చివేయాలని వాహనదారులు, గ్రామస్తులు కోరారు. 9ఏళ్ల కిందట నిర్మించిన బీటీరోడ్డు ధ్వంసమై గుంతలమయంగా మారడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కేటీదొడ్డి/గట్టు: కేటీదొడ్డి మండలంలోని చింతలకుంటకు చెందిన కమలాకర్‌గౌడ్ కుమారుడు బాబు, గట్టు మండలం ఆలూరుకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు కర్రెప్ప, పూజారి నర్సింహులు కుమారుడు భరత్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయులుగౌడ్ సోమవారం బాధిత కుటుంబాను పరామర్శించారు. వారి మృతికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట పవన్‌కుమార్, నాగరాజ్‌గౌడ్ ఉన్నారు.

విద్యార్థికి అభినందన



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లికి చెందిన దాసరిగల్ల దానన్న, జయ్యమ్మ దంపతుల కుమారుడు సందీప్ ఎంబీబీఎస్‌లో సీటు సాధించాడు. ఈ సందర్భంగా పలు పార్టీల నాయకులు సోమవారం విద్యార్థితో పాటు తల్లిదండ్రులను సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జోగుల రవి, వెంకటన్న, సత్యం, వెంకటేష్, చిన్న నర్సింహులు, నరేష్, పరుశరాం, తిమ్మప్ప పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

గద్వాల అర్బన్: నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌మార్గ్‌లో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు మద్దతు ప్రకటించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రంగన్న, ఖాసీం, ఆశన్న, హన్మంతు, నర్సింహులు, హరిప్రసాద్, పరుశరాం, సోని పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



అయిజ: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం మండలంలోని ఎక్లాస్‌పురంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికెళ్లి ఆహ్వానించారు. ఈనెల 6న శ్రీకృష్ణాష్టమి వేడుకల నిర్వహణ, 7న ఉత్సవ విగ్రహ ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. చిన్న వీరేష్, నరేష్, శ్రీను, మోహన్, లక్ష్మన్న, వీరేష్, భాస్కర్ పాల్గొన్నారు.

భారీ వర్షం

మానవపాడు: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. మండలవ్యాప్తంగా 56.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. పంట పొలాల్లోకి వర్షపునీరు వచ్చి చేరింది. నారాయణపురం నుంచి జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిలోకి నీళ్లు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ దారి గుండా శాంతినగర్, కలుకుంట్ల, మద్దూరు, అమరవాయి, పెద్దఆముదాలపాడు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వర్షం పడినప్పుడల్లా అండర్ బ్రిడ్జిలోకి నీళ్లు చేరుతుండడంతో ఇబ్బందులకు గురవుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

అయిజ: మండలంలో మోస్తారు వర్షం కురిసింది. పట్టణంలోని ప్రధాన రోడ్లు జలమయమయ్యాయి. ఉదయం 9గంటల వరకు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఎస్‌బీఐ భవనం ఎదుట వర్షపునీరు నిలిచిపోవడంతో ఖాతాదారులు బ్యాంక్‌లోకి వెళ్లేందుకు అవస్థలు పడ్డారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డ్రెయినేజీలను నిర్మించాలని కోరారు.



అయిజలో ఎస్‌బీఐ ఎదుట నిలిచిన వర్షపునీరు

ధరూరు: మండలంలో ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 12నుంచి ఒంటిగంట వరకు వర్షం కురువడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఎండుముఖం పట్టిన మెట్ట పంటలకు జీవం పోసినట్లయ్యింది. కాగా పత్తి కాయలు పగిలే దశలో పంట ఉండగా, ముసురు కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



నారాయణపురం రైల్వే అండర్ బ్రిడ్జిలోకి చేరిన నీళ్లు



మానవపాడు మండలం చెన్నిపాడులో మునకకు గురైన పత్తిపంట

రైతు సంక్షేమానికి అహర్నిశలు కృషి



ఉండవెల్లి మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్రహం

ఉండవెల్లి: రైతు సంక్షేమానికి సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ బీసమ్మ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైతులకు సాగునీటి వసతి కల్పించేందుకు రిజర్వాయర్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో మల్లమ్మకుంట, తుమ్మిళ్ల, క్యాతూరు, మారమునగాల రిజర్వాయర్ల ఏర్పాటుకు సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ చూపారని తెలిపారు. రైతులకు ఎలాంటి సమస్య కలుగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

సమస్యలు ఏకరవు

మండల కేంద్రంతోపాటు కంచుపాడు, ఇటిక్యాలపాడు, చిన్న ఆముదాలపాడు, ఏ.బూడిదపాడు గ్రామాల్లో విద్యుత్ సమస్యలతో సతమతమవుతున్నామని ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్‌శాఖ ఏడీతో ఫోన్‌లో మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టొద్దని వైస్ ఎంపీపీ దేవన్న అన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే, ట్యాంకర్లతో నీటిని అందించామని, ఇందుకు సంబంధించిన బిల్లులు ఇవ్వాలని సర్పంచులు కోరారు. భగీరథ నీటి సరఫరాలో అంతరాయం కలుగకుండా చూడాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ జయంతి, ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఏఓ సురేఖ, డీటీ జయంతి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు లోకేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట..

మానవపాడు: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసి ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తోందని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. మండల కేంద్రంలోని ఈద్గాలో రూ.10లక్షలతో సీసీ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇచ్చి అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు దామోదర్‌రెడ్డి, వెంకట్రాములు, హుస్సేన్ పాల్గొన్నారు.

అండగా ఉంటాం..

అలంపూర్: అనారోగ్యం ఇతర కారణాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పేదలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. రాజోలి మండలం పెద్ద ధన్వాడకు చెందిన దానమయ్య అనారోగ్యంతో కర్నూల్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే.. ఆస్పత్రికి వెళ్లి అతడిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఎమ్మెల్యే వెంట పరమేష్‌గౌడ్, తిమ్మారెడ్డి, మాణిక్యం, ఎల్లప్ప ఉన్నారు.

పాఠశాలల అభివృద్ధికి విరాళం



శాంతినగర్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కోయిల్‌దిన్నెకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు జి.కాంతారెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు చెక్కు అందజేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేందుకుగానూ తనవంతు సాయం అందజేసినట్లు చెప్పారు. విశ్రాంత ఉపాధ్యాయుడి ఉదారతకు కలెక్టర్ అభినందనలు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక

గట్టు: మండలంలోని తారాపురం ప్రాథమిక పాఠశాల ఎస్‌జీటీ కమ్మరి కృష్ణ, బస్వాపురం పాఠశాల ఉపాధ్యాయుడు చంద్రకాంత్‌వదన్ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరి ఎంపికపై ఆయా గ్రామాల ప్రజలతో పాటు నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు పాల్వాయి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి కొండాపురం ప్రతాప్, ఉపాధ్యాయులు రాజుసాగర్, సీఆర్పీలు రమేష్‌గౌడు, శ్రీధర్, వెంకటేష్ హర్షం వ్యక్తం చేశారు.

70మందికి జరిమానా

గద్వాల క్రైం: మద్యం తాగి వాహనాలు నడిపిన 70మందికి సోమవారం గద్వాల అదనపు ప్రథమశ్రేణి న్యాయమూర్తి ఉదయ్‌నాయక్ జరిమానా విధించినట్లు పట్టణ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. ఇటీవల పట్టణ శివారులో వాహనాల తనిఖీ చేపట్టగా, కొందరు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడినట్లు పేర్కొన్నారు. వారిపై డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా, ఒక్కొక్కరికి రూ.1500 నుంచి రూ.2వేల వరకు జరిమానా విధించినట్ల ఎస్‌ఐ తెలిపారు. మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్థలం కేటాయించండి

ఆత్మకూర్: పట్టణంలోని ముస్లింలకు ఖబరస్తాన్ (శ్మశానవాటిక) నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలని కోరుతూ ముస్లింలు డీటీ చాణక్యకు సోమవారం వినతిపత్రం అందజేశారు. పట్టణ శివారులోని సర్వేనంబర్ 474లో నాలుగు ఎకరాలకుపైగా ప్రభుత్వ స్థలం ఉందని, ఈ భూమిని ముస్లింలకు కేటాయించి సహకరించాలని కోరారు. పెరుగుతున్న జనాభా రీత్యా పాత శ్మశానవాటికలో స్థలం సమాధులతో నిండిపోయిందని, దీంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈద్గా కమిటీ నాయకులు ముజాహిద్, జంషీద్‌సాబ్, మోసీన్, ఖమర్, సిరాజ్‌అహ్మద్, ఖమురుద్దీన్, గనిసాబ్, ఖలీల్, జావెద్, ముక్తదీర్ ఉన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మల్దకల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి పార్టీ కార్యకర్తలకు సూచించారు. మండలంలోని పాల్వాయిలో సోమవారం ఇంటింటికి పిడికెడు మట్టి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రధాని మోదీ అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలన్నారు. రాబోవు ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడమే ప్రధాన లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాముడు, హనుమన్న, ఖాజా, సలీం, రాజు, రషీద్, వెంకటేశ్వర్‌రెడ్డి, లక్ష్మయ్య, నాగరాజు, వెంకటేష్, మహేష్, వెంకటేశ్వర్‌రెడ్డి, రాజమ్మ, చంద్రన్న, తిరుపతిరెడ్డి, లక్ష్మీనారాయణ, రాజశేఖర్, నర్సింహులు పాల్గొన్నారు.



పాల్వాయిలో మట్టి సేకరిస్తున్న బీజేపీ నాయకులు

తాజా, మాజీ ఎమ్మెల్యేలు చేసిందేమీలేదు..



తుమ్మిళ్ల ఎత్తిపోతలను పరిశీలిస్తున్న శేషు

రాజోళి: తాజా ఎమ్మెల్యే అబ్రహం, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ నియోజకవర్గానికి చేసిందేమి లేదని సామాజిక కార్యకర్త ఆర్‌వీ శేషు అన్నారు. సోమవారం మండలంలోని తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేరుకే లిఫ్ట్‌ను తెచ్చామని చెప్పి ఓట్లు దండుకున్నారన్నారు. అధికారంలోకి వచ్చాక ఆర్డీఎస్ ఆయకట్టును ఆగం చేశారని విమర్శించారు. ప్రస్తుతం ఎగువ నుంచి నీళ్లు వస్తే లిఫ్ట్ ద్వారా ప్రక్రియ చేపట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. షిల్ట్ పేరుకుపోయినా పట్టించుకోకుండా వదిలేశారని, దీంతో ఆర్డీఎస్ కెనాల్ అధ్వానంగా తయారైందన్నారు. మళ్లీ తుమ్మిళ్లకు అదే పరిస్థితి తెస్తున్నారని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ పూజలు

జోగుళాంబ శక్తిపీఠం: శ్రావణ సోమవారం సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయాలను సందర్శించి అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయాల్లోనే కాకుండా ఇళ్లల్లో మహిళలు శ్రావణలక్ష్మిని నెలకొల్పి ప్రదోషకాల పూజలు నిర్వహించారు. ముత్తయిదువులకు పసుపు, కుంకుమ, గాజులు అందజేసి ఆశీర్వాదం పొందారు.

ఉండవెల్లి: మండలంలోని భైరాపురం శివాలయం, వీరభద్రస్వామి ఆలయాల్లో పంచామృతాభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నందికోళ్ల సేవ నిర్వహించారు.

మానవపాడు: వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు పండాలని కాంక్షిస్తూ మండల కేంద్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జునస్వామి ఉత్సవమూర్తి ఊరేగింపు చేపట్టారు. రైతులు 101 కాడెద్దులతో ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు.



బీచుపల్లి శివాలయంలో..

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి క్షేత్రంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామి వారిని దర్శించుకొని అభిషేకాలు, అర్చనలు చేశారు.



మానవపాడులో మల్లికార్జునస్వామి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



ఉండవెల్లి మండలం భైరాపురంలో..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పులు

మల్దకల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణులకు సాధారణ ప్రసవం జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు డాక్టర్ స్వరూపారాణి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ గర్భిణులకు వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు. ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడంతోపాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పులపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, సత్యమ్మ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ స్వరూపారాణి

కనీస మద్దతు ధరల చట్టం తేవాలి



సదస్సులో పాల్గొన్న నాయకులు

గద్వాల అర్బన్: రైతులు పండించే పంటలకు కనీస మద్దతు ధరల చట్టం తేవాలని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. విద్యుత్ సవరణ బిల్లు 2020ను రద్దు, రైతుల రుణాల మాఫీ, రుణ విమోచన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రైతులకు అనుకూలంగా ఫసల్ బీమా పథకాన్ని మార్చాలని, కౌలు రైతులను ఆదుకోవాలన్నారు. లేనిపక్షంలో రైతాంగ ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వీవీ నర్సింహ, ఖాసీం, ప్రభుదాస్, ఆశన్న, వెంకట్రాములు పాల్గొన్నారు.

నేటి నుంచి రిలే నిరాహార దీక్షలు

గద్వాల: సమగ్ర శిక్ష అభియాన్‌లో కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నుంచి 11వ తేదీ వరకు రిలే నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు ఆ సంఘం జేఏసీ నాయకులు హుస్సేనప్ప, గోపాల్ తెలిపారు. ఈ మేరకు సోమవారం డీఈఓ సిరాజుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను రెగ్యులరైజ్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు జీవిత బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే సమ్మె చేపడుతామని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో చేపట్టే దీక్షలకు సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

ఇంటింటి సర్వేతో టీబీ వ్యాధిగ్రస్తుల గుర్తింపు



పచ్చర్లలో అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

రాజోళి: గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి టీబీ వ్యాధిగ్రస్తులను గుర్తిస్తున్నట్లు సూపర్‌వైజర్ జయప్రకాష్ తెలిపారు. మండలంలోని పచ్చర్లలో సోమవారం వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ లక్షణాలు, వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. టీబీ లక్షణాలు ఉన్న వారు తప్పనిసరిగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులతోపాటు 6నెలలపాటు ఆర్థిక సాయం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రంజిత్‌కుమార్, ఖమ్రూన్, మహబూబ్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలి

రాజోళి: నిత్యావసర సరుకుల ధరలు తగ్గించి సామాన్యులకు ఊరట కలిగించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మకు వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలను వెంటనే తగ్గించాలని కోరారు. మణిపూర్ ఘటనపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో లక్ష్మన్న, కోటి నాగప్ప, దావీదు, భవన నిర్మాణరంగ కార్మికులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన టవేరా వాహనం

మానవపాడు: రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలైన ఘటన మండలంలోని బోరవెల్లి స్టేజీ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొందుర్గు మండలం తుమలపల్లికి చెందిన 15మంది టవేరా వాహనంలో తిరుపతి, మహానంది, అలంపూర్ క్షేత్రాలను దర్శించుకొని స్వగ్రామానికి వెళ్తుండగా, బోరవెల్లి స్టేజీ సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో లక్ష్మి, రాంచంద్రయ్య, రమాదేవికి తీవ్ర గాయాలు కాగా, బుచ్చమ్మ, కిష్టమ్మ, శిరీషకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగ్రాతులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రాము తెలిపారు.

జూరాలలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

ఆత్మకూర్: మండలంలోని జూరాలలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో గరుడసహిత ధ్వజస్తంభ ప్రతిష్ఠ, గ్రామదేవత కర్రెమ్మతల్లి (పెద్దమ్మతల్లి) నాభి శిల బొడ్రాయి ప్రతిష్ఠా మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి పాతకాల పూజలు, యంత్ర ప్రతిష్ఠ, మూర్తి ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, పూర్ణాహుతి, ఆరాధన, మహాకుంభధేనుదర్శనం, హారతి ప్రత్యేక పూజలను వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శివరంజని, సర్పంచ్ మహిమూద, ఎంపీటీసీ సభ్యుడు పరమేష్, నిర్వాహకులు విరేశలింగం, తిరుపతయ్యగౌడ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

మౌలాలీ గంధోత్సవం

మదనాపురం: మండలంలోని దుప్పల్లిలో సోమవారం సాయంత్రం మౌలాలీ, మహబూబ్ సుభాని, గంధోత్సవాలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి ఏటా వర్షాకాలంలో సరైన వర్షాలు కురవకుంటే గంధోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ముందుగా మహబూబ్ సుభాని దర్గాలో పాతేలు నిర్వహించి గుర్రంతో పాటు భాజభజంత్రీలు మోగిస్తూ కాలినడకన గ్రామస్తులు కొన్నూరు సమీపంలో ఉన్న మౌలాలీ గుట్టపైకి వెళ్లి అక్కడ కొలువుదీరిన మౌలాలీ దర్గాలో ప్రత్యేక ఫాతే కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దర్గాలో సమర్పించిన గంధాన్ని తలపై మోస్తూ తీసుకొచ్చారు. గ్రామంలో ఊరేగింపు నిర్వహించి దర్గా షరీఫ్‌కు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

